అక్రమ సస్పెన్షన్లను నిరసిస్తూ నేడు డిపోల వద్ద ధర్నాలు

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం

ఏలూరు అర్బన్ : ఆర్‌టిసి పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకలకు సంబంధించి అసలు దోషులను వదిలి, సంబంధం లేని వారిని విధుల నుండి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 25న మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్యను కూడా కక్ష సాధింపు చర్యతో విధుల నుండి సస్పెన్షన్ చేశారని, అన్ని రకాల న్యాయ ప్రమాణాలను జిల్లా డిపిటిఒ, విజయవాడ జోన్ అధికారులు ఉల్లంఘించారని విమర్శించారు. దీనిపై చర్చించిన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ ఈ సస్పెన్షన్లను తీవ్రంగా ఖండిస్తూ, వాటిని తక్షణం రద్దు చేసి నలుగురు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు ఇచ్చిందని పేర్కొన్నారు.

డిప్యూటీ సిఎం పర్యటన సందర్భంగా రాజవరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మళ్లీ బారికేడ్ల పాలన..!

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పర్యటనలో పోలీసుల అడ్డుకట్టలు

గత వైసిపి ప్రభుత్వంలో ఇదే తీరుపై కూటమి నేతల విమర్శలు

ఐఎస్.జగన్నాథపురంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆలయ విస్తరణకు 30 ఎకరాల భూమి కేటాయింపు

గుంతల రోడ్లపై గళమెత్తిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం

గత ప్రభుత్వ తరహాలోనే కూటమి ప్రభుత్వం సైతం బారికేడ్ల పాలనకు శ్రీకారం చుట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్.జగన్నాథపురంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా బందోబస్తు పేరుతో పోలీసులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు చర్చనీయాంశమయ్యాయి. వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ పర్యటన సందర్భంగా బారికేడ్లు, పరదాలు వంటివి ఏర్పాటు చేయడంపై అప్పట్లో కూటమి నేతలు తీవ్ర విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే పరదాలు, బారికేడ్ల పాలన ఉండదని, ప్రజలకు దగ్గరగా ఉంటామని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వమొచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ బారికేడ్ల పాలనే సాగుతోంది. బందోబస్తు పేరుతో పోలీసులు చేస్తున్న అతి వ్యవహారంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు ఇలా చేస్తున్నారా అనే చర్చ సైతం సర్వత్రా సాగుతోంది. సిఎం, డిప్యూటీ సిఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. డిప్యూటీ సిఎం పర్యటన ఖరారైనప్పటికీ ఆదివారం రాత్రి పది గంటల వరకూ మీడియాకు సంబంధించి ఎటువంటి ఏర్పాట్లూ చేయని పరిస్థితి కన్పించింది. జిల్లా అధికారులు తమకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వదిలేశారనే ఆరోపణలున్నాయి. ఎట్టకేలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పేషీ అధికారులు జోక్యం చేసుకుంటే తప్ప అధికారులు స్పందించని పరిస్థితి ఉంది.

మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గత పర్యటన సందర్భంగా ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన సందర్భంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ ప్రదక్షిణ మండప నిర్మాణంతోపాటు గ్రామం నుంచి కొండపైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మింపజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి అంశాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లారు. అందుకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి రూ.8.7 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆలయానికి అనుబంధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు 30 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆ భూమి కేటాయింపునకు సంబంధించిన పత్రాలు పవన్ కళ్యాణ్ ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ స్థల పురాణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురి నుంచి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. రెండోసారి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఐఎస్.జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విచ్చేశారు. ప్రత్యేక విమానంలో రాజమండ్రి చేరుకున్న ఆయన రోడ్డుమార్గం గుండా కొయ్యలగూడెం మండలం రాజవరం మీదుగా ఐఎస్.జగన్నాథపురం చేరుకున్నారు. ఆయనకు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు ఎంఎల్‌ఎలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. రాజవరంలో కొంతదూరం వాహనం దిగి నడుచుకుంటూ ముందుకు సాగారు. జనం తాకిడి ఎక్కువ కావడంతో తిరిగి కారు ఎక్కి ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. రూ.3.5 కోట్లు దేవాదాయ శాఖ నిధులతో ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న ప్రదక్షణ మండపానికి, రూ.3.7 కోట్లతో ఆలయంపైకి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బి శాఖ ఆధ్వర్యాన పొంగుటూరు-లక్కవరం మధ్య గోతులమయంగా ఉన్న రహదారికి రూ.1.5 కోట్లతో మరమ్మతులు చేయించిన రహదారిని పరిశీలించారు. రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో పొలాల్లో పని చేసుకుంటున్న కూలీలను ఆప్యాయంగా పలకరించి, వారితో ఫొటోలు దిగారు. ఈ పర్యటనలో ఎంఎల్‌ఎలు మద్దిపాటి వెంకటరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, చిర్రి బాలరాజు, బడేటి చంటి, పులపర్తి రామాంజనేయులు, పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, జెసి అభిషేక్ గౌడ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలయానికి భూముల పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

రోడ్ల సమస్యపై ఆందోళన చేపట్టిన వారిని చెదరగొడుతున్న పోలీసులు

గుంతల రోడ్లపై గళమెత్తిన జనం..

కొయ్యలగూడెం మండలంలోని తిమ్మనకుంట నుండి గంగన్నగూడెం, సీలింగులు, కృష్ణంపాలెం, గవరవరం వరకూ తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు అత్యంత దారుణంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. రాజవరం గ్రామ పంచాయతీ శివారు గంగవరం గ్రామస్తులు సుమారు కిలోమీటర్ మేర రోడ్డు అధ్వానంగా తయారైందంటూ పెద్దఎత్తున డిప్యూటీ సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. పోలీసులు వారినీ అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రోడ్డుపై వారు నిరసన తెలిపారు. పవన్‌కల్యాణ్ తిరుగు పర్యటనలో వీరి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. రోడ్డు వేయిస్తానని పవన్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

1న జిల్లాకు సిఎం చంద్రబాబు రాక

ఉంగుటూరు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిఎం చంద్రబాబు డిసెంబర్ ఒకటో తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రతినెలా ఒక్కో జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో డిసెంబరు నెల పింఛన్ల పంపిణీ ఈసారి జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నియోజకవర్గంలో ఏ మండలంలోని ఏ గ్రామంలో పర్యటిస్తారో అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టత రానుంది. దీంతో సిఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏర్పాట్లలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఉంగుటూరు రానున్నారని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు.

ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లను వ్యతిరేకిస్తూ

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

మద్దతు తెలిపిన ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్, సిపిఎం నేతలు

దీక్షలో పాల్గొన్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అక్రమ సస్పెన్షన్లకు వ్యతిరేకంగా ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ తెలిపారు. అక్రమ సస్పెన్షన్లకు వ్యతిరేకంగా ఏలూరు డిపో వద్ద ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలను రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి జరిగితే అసలు దోషులను శిక్షించకుండా డబ్బులు కట్టించుకుని వారిని రక్షించడం తీవ్ర నేరమని అన్నారు. ఈ అవినీతిలో సంబంధం లేని అమాయకులైన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అవసరమైతే ఈ అంశాన్ని జెఎసి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు నాయకత్వంలో రాష్ట్రస్థాయికి తీసుకెళ్తామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వెంటనే అక్రమ సస్పెన్షన్లు రద్దు చేసి వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి జెఎసి నాయకులు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా డబ్బులు కట్టిన వారిని రక్షించే సంస్కృతిని ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికైనా వీడి సమగ్ర విచారణ జరిపి అసలు దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం దీక్షల్లో ఆర్‌టిసి కార్మికులు వి.రామారావు, ఎ.రమేష్, ఎస్‌కె.నాగూర్, కెఎస్.రావు, కెవివి.చారి, సర్వేశ్వరరావు, ఎస్‌వివి.నారాయణ, జె.భాస్కర్, కెవివి.రావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మద్దతు

అక్రమ సస్పెన్షన్లను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సిపిఎం పూర్తి మద్దతు తెలిపింది. కార్మికుల దీక్షా శిబిరాన్ని సిపిఎం బృందం సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్ మాట్లాడుతూ ఆర్‌టిసి పెట్రోల్ బంక్‌లో అవినీతిపై సరైన విచారణ జరపకుండా, అసలు నేరస్తులను పట్టుకోకుండా, నిరపరాధులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. చట్టపరంగా విచారణ జరిపి నేరస్తులను కఠినంగా శిక్షించాలని, బేషరతుగా అక్రమ సస్పెన్షన్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికుల ఆందోళనకు సిపిఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్, అరుణకుమారి, జి.కోటేశ్వరరావు, దుర్యోధన, ఐ.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'రైతన్న మీకోసం'

పలు శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజర్

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం సోమవారం తూతూమంత్రంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవసాయ సహాయకులు, పశు సంవర్థక, మత్స్యశాఖ, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులు, ఎనర్జీ సహాయకులు, ప్రగతిశీల రైతులు, సొసైటీలు, మార్కెట్ కమిటీ, నీటిసంఘం సభ్యులుగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వీరు ప్రతిరోజూ 90 మంది రైతులను కలిసి ప్రభుత్వం ప్రకటించిన రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్య అభివృద్ధికి శాశ్వత మార్పులు, నీటిభద్రత, డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, ప్రభుత్వ చర్యలు అంశాల గురించి రైతులకు వివరించాలి. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సందేశం ముద్రించిన కరపత్రాలను రైతులకు అందజేయాలి. రైతుల అభిప్రాయాలను ఎపి ఎఐఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలి. డిసెంబర్ మూడో తేదీన గ్రామ సచివాలయాలవారీగా సర్వేల ఆధారంగా రైతుల అభిప్రాయాల మేరకు 2026-27 సంవత్సరపు కార్యాచరణ ప్రణాళికపై వర్క్‌షాప్ నిర్వహించాల్సి ఉంది. వీటన్నింటికీ భిన్నంగా సోమవారం భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆధ్వర్యంలోని గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులు మాత్రమే పాల్గొన్నారు. ఇతర అధికారులు, సిబ్బంది జాడ లేదు. భీమడోలు కేంద్రంగా పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖ తదితర శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు ఉన్నారు. వీరి పర్యవేక్షణ కొరవడిన కారణంగా సచివాలయాలవారీగా సంబంధిత విభాగ సిబ్బంది ఉన్నప్పటికీ ఏఒక్కరూ పాల్గొనకపోవడం గమనార్హం. మండలం అంతా ఇదే తరహాలో కార్యక్రమం కొనసాగిందని తెలుస్తోంది.

ఎఒ, విఆర్‌ఒలు మినహా గైర్హాజరైన మిగిలిన సిబ్బంది

లేబర్‌కోడ్‌ల రద్దు కోరుతూ నిరసనలు

ఆగిరిపల్లిలో

ప్రజాశక్తి - ముసునూరు

కార్మికులకు నష్టం కలిగించే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు అన్నారు. సోమవారం ముసునూరు ప్రధాన సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉండే లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో కార్మికవర్గానికి ఉద్యోగ భద్రతగాని, కనీస వేతనాలుగాని, ఇతర సౌకర్యాలుగాని కోల్పోయే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, ప్రసాద్ శ్రీను, రాజా, గణేష్, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు అన్నారు. లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక పెద్ద కొళాయి సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఏపూరి రవీంద్ర, ముత్యాల నరేష్, షేక్ జహంగీర్ భాషా, సత్తు కోటేశ్వరరావు, తాడి అర్జునరావు, రంగారావు, మోహన్‌రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నిడమర్రు: భువనపల్లిలో నినదిస్తున్న కార్మికులు



ముసునూరులో

నిడమర్రు: లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి, పాత 29 కార్మిక చట్టాల అమలు కొనసాగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన భువనపల్లిలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోని పక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అలుమోలు బాలయ్య, చల్లా రాంబాబు, వలపు రమణ, కోసూరు ఏసు, దుర్గారావు, రమేష్, వెంకటేష్ మాట్లాడారు.

కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

21 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్, రాష్ట్ర జెఎసి వైస్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు, జిల్లా ఛైర్మన్ కె.వినోద్ మాట్లాడుతూ 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్ర విద్యా శాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులను విలీనం చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు అన్ని కేటగిరీలకు పెంచి, ఎంటిఎస్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒడిశా, పంజాబ్, కేరళ ప్రభుత్వాల మాదిరి ఆంధ్రాలోనూ ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. గతంలో జిఒ 3 ప్రకారం పిఆర్‌సి ఆఖరి స్కేల్ వేతనాలు చెల్లించినట్లు ఇప్పటి పిఆర్‌సి ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్ట్‌టైమ్ ఉద్యోగులను ఫుల్‌టైమ్‌గా మార్చి, జిల్లాల్లో సిఆర్‌పిలను వందల కిలోమీటర్ల దూరప్రాంతాలకు బదిలీ చేయడాన్ని ఆపాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాబ్‌చార్ట్ ప్రకారం సాయంత్రం ఐదు గంటలు దాటాక వెబినార్ల పేరుతో వేధించడం ఆపాలన్నారు. ఈ ధర్నాకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎంఇఒ సబ్బితి నరసింహమూర్తి, జంగం రవీంద్ర, ఎవిఎన్.భాస్కర్, ఎ.సర్వేశ్వరరావు తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు. జెఎసి నేతలు కమలాకర్, మణికంఠ ,లక్ష్మి పాల్గొన్నారు.

పేదల ల్యాండ్ సీలింగ్ భూములను రక్షించండి

9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని డిమాండ్ - ఫ్రీ హోల్డ్ విధానం రద్దు కోరుతూ వ్యకాస ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదల ల్యాండ్ సీలింగ్ భూములను రక్షించాలని, 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని, ఫ్రీ హోల్డ్ విధానం రద్దు కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పేదలు సోమవారం ధర్నా నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షులు యాగంటి సీత అధ్యక్షతన చేపట్టిన ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడారు. పేదల భూహక్కులకు ఆసరాగా ఉన్న 9/77 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం దారుణమన్నారు. ల్యాండ్ సీలింగ్, అసైన్డ్ భూముల కొనుగోలు, అమ్మకాలకు అవకాశం కల్పించే ఫ్రీహోల్డ్ విధానాన్ని మంత్రివర్గం ఆమోదించడం పేదలపై ప్రత్యక్ష దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1974, 75 కాలంలో దేశవ్యాప్తంగా సాగిన పోరాటాల ఫలితంగా ల్యాండ్ సీలింగ్ చట్టం అమల్లోకి వచ్చిందని, ఆపై లక్షలాది ఎకరాలను పేదలకు పంచి అసైన్డ్ పట్టాలిచ్చారని గుర్తు చేశారు. ఆ భూములను కాపాడే 9/77 చట్టాన్ని రద్దు చేసి, పేదల చేతుల్లోని భూములను భూస్వాములు, కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నించిందని, నాడు సంఘం ఆధ్వర్యాన ఉధృతంగా ఆందోళనలు చేపట్టడంతో వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. ఆ సమయంలో చంద్రబాబు 9/77 చట్టాన్ని అమలు చేయాలని అన్నారని, అధికారంలోకొచ్చాక మాట మార్చి పేదల భూములు లాక్కోవడానికి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని, ల్యాండ్ సీలింగ్ భూములు, ఎర్రకాలు ప్రాజెక్ట్ మిగులు భూములను పేదలకు పంచాలని కోరారు. మండలంలోని పంగిడిగూడెం, కేతవరం, గురవాయిగూడెం, మైసన్నగూడెం, పట్టిసపాలెం, ఎ.పోలవరం, తాడువాయి, చక్రదేవరపల్లి గ్రామాల్లోని భూములకు పేదలకు హక్కులు ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్‌ఐకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు జోడే సూర్యచంద్రరావు, నీట్ల నాగరాజు, పటాన్ మస్తాన్, ఎం.బాలరాజు, కె.సుబ్బారావు, ఎం.అశోక్‌కుమార్, పిల్లి పోతురాజు, ఎ.కృష్ణ, ఆర్.సత్యవతి, బి.శివయ్య, ఎం.కుమారి, ఎ.కాంతమ్మ, గోసాల మరియమ్మ, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న పేదలు, నేతలు

రేపు 'కొల్లేరు'పై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, ఎకో సెన్సిటివ్ జోన్, చిత్తడి నేలల పరిరక్షణ పేరుతో పదో కాంటూరుకు పెంచరాదని, కొల్లేరు ప్రజల, రైతుల జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కొల్లేరు ప్రజలు, రైతుల పరిరక్షణ కమిటీ తరపున ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు ఏలూరులోని అంబికా థియేటర్ సమీపంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కొల్లేరు ప్రజలు, రైతుల జీవితాల్లో మార్పు లేదని, అసలు వారు కొల్లేరులో జీవించే హక్కునే కోల్పోయే పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా హామీలివ్వడం, అధికారంలోకొచ్చాక విస్మరించడం సర్వసాధారణమైందని విమర్శించారు. కొల్లేరు పరిరక్షణ పేరుతో చేపల చెరువులను ధ్వంసం చేసి వారి ఉపాధిని దెబ్బతీశారని, ఇప్పుడు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో రైతులు రబీ సాగు చేయడానికి వీల్లేకుండా అటవీశాఖ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సమావేశంలో కొల్లేరు ప్రజలు, పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని రవి విజ్ఞప్తి చేశారు.

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

పిజిఆర్ఎస్‌కు 277 అర్జీలు : డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు



వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుండి డిఆర్‌ఒతోపాటు ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, దేవకిదేవి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత సమయంలోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. పిజిఆర్ఎస్‌లో 277 దరఖాస్తులు అందాయని, వాటిలో నిబంధనల మేర ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారునికి తెలియజేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తును పరిష్కరించిన అనంతరం పరిష్కార విధానంపై అర్జీదారునితో సంబంధిత శాఖల అధికారులు మాట్లాడాలన్నారు.

రేపు డిఆర్‌సి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డిఆర్‌సి సమావేశం ఈ నెల 26వ తేదీ బుధవారం జరగనుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి డిఆర్‌సి సమావేశం సాగుతోంది. జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరిస్తాం

పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - భీమడోలు

మాట్లాడుతున్న మంత్రి మనోహర్

రైతుసేవా కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాజాగా గుర్తించిన ఇబ్బందుల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం వెళ్తున్న మంత్రి మార్గమధ్యంలో గుండుగొలను వద్ద జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులను సోమవారం ఆయన స్థానిక ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి పలకరించారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై రైతుల సలహాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు ప్రతి గింజా కొనుగోలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లిలో పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఉంగుటూరుకు చెందిన వంగపండు శ్రీదేవి(56) గుండెపోటుతో మృతి చెందారు. ఆమె స్వగ్రామం ఉంగుటూరు. ఆమె ఉంగుటూరు మండలంలోని రావులపర్రు, కాగుపాడు తదితర గ్రామాల్లో కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం ఇటీవల బదిలీపై తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి పంచాయతీలో పని చేస్తున్నారు. ఉంగుటూరు మండలం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. విశ్రాంత పంచాయతీ విస్తరణాధికారి షేక్ సంశుద్దీన్, సెక్రటరీల నేతల విజయ్‌కుమార్, బొడ్డు రవిచంద్ర కుమార్, నీలం ప్రసాద్, గిరిధర్ శ్రీనివాసరావు తదితర కార్యదర్శులు సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో సీనియర్ పాత్రికేయుడు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

సీనియర్ పాత్రికేయుడు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ న్యాయవాది గుత్తికొండ శ్రీనివాసరావు (55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన ఉంగుటూరు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా పని చేశారు. గతంలో ప్రజాశక్తి, వార్తతో పాటు పలు పత్రికల్లో రిపోర్టర్‌గా పని చేశారు. ఆయన భౌతికకాయాన్ని ఏపియు జాతీయ కార్యదర్శి సోమసుందర్, ఉంగుటూరు నియోజకవర్గ రిపోర్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.సత్యనారాయణ, ఉంగుటూరు మండలాధ్యక్షుడు ముప్పన భుజంగరావు, అర్జ వీరస్వామి, ఆంధ్రజ్యోతి భీమవరం స్టాఫ్ రిపోర్టర్ కిషోర్, విశ్రాంత న్యాయమూర్తి బొమ్మిడి అప్పారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఎపియుడబ్ల్యుజె సంతాపం

ఐజెయు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.సోమసుందర్, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి మురళీకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిబాబా, గజపతి ప్రసాద్, కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా భాస్కర్, ఉంగుటూరు మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముప్పన భుజంగరావు, పివి.సత్యనారాయణలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విలేకరులు పెండ్యాల రవిశంకర్, అర్జ బుల్లి వీరస్వామి, అడపా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిజిఒ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి ఎన్‌జిజిఒ అసోసియేషన్ ఏలూరు తాలూకా యూనిట్ అధ్యక్షులుగా జి.శ్రీధర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా గంటా చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025 నుంచి 2028 వరకు మూడేళ్ల పదవీ కాలానికి అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం నిర్వహించారు. ముందుగా 600 మంది సంఘ సభ్యులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎన్నికల అధికారులుగా నోరి శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా ఆర్.జగదీశ్వరి, ఎన్నికల పరిశీలకులుగా ఎన్.ఝాన్సీలక్ష్మిబాయి వ్యవహరించారు. నూతన కార్యవర్గంలో నోటిఫికేషన్‌లో పేర్కొన్న 16 పదవులకు, మూడు ఇసి పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షులుగా జి.శ్రీధర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా జి.చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షులుగా జి.రవికుమార్‌తో ఐదుగురు ఉపాధ్యక్షులుగా, ఆరుగురు సహాయ కార్యదర్శులతో కలిపి మొత్తం 19 మందితో తాలూకా యూనిట్ నూతన కమిటీ ఏర్పడినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికైన కమిటీని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ అభినందించారు.



ఎన్‌జిజిఒ ఏలూరు తాలూకా కార్యవర్గం

ఆటల పోటీల్లో 'క్రాంతి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కలిదిండి

అప్సా డెమొక్రటిక్ ఆధ్వర్యంలో కైకలూరు డివిజన్ స్థాయిలో ముదినేపల్లిలో జరిగిన ఆటల పోటీల్లో మండలంలోని కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ చన్న ఒశెట్టి కృష్ణ అన్నారు. ఖోఖో సీనియర్స్ బాలురు, బాలికల విభాగంలో, ఖోఖో జూనియర్స్ బాలురు, బాలికల విభాగంలో ప్రథమ బహుమతులు సాధించారన్నారు. అలాగే లాంగ్ జంప్, వాలీబాల్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్ విభాగాల్లోనూ ప్రధాన స్థానాల్లో నిలిచి మొత్తంగా 60 బహుమతులు ఆదివారం ముదినేపల్లిలో జరిగిన పోటీల్లో సాధించారన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ చన్నంశెట్టి అజేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు దక్షిణపు వీధికి చెందిన ఎర్ర గోవిందు స్థానికంగా కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో 2023 సెప్టెంబర్ నాలుగో తేదీ రాత్రి పది గంటల సమయంలో ఎర్ర గోవిందు బాదంపాలు సీసాను పగలగొట్టి గోపీ అనే వ్యక్తి మెడలో పొడవడంతో ఆయన మృతి చెందాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో వాదోపవాదనలు సోమవారం పూర్తయ్యాయి. గోవిందు నిందితుడుగా గుర్తించిన న్యాయస్థానం అతనికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు.

వరి గడ్డి దగ్ధం

ప్రజాశక్తి - కలిదిండి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న వరి గడ్డి దగ్ధమైన ఘటన స్థానిక పేట కలిదిండిలో సోమవారం చోటు చేసుకుంది. పేట కలిదిండికి చెందిన రైతు యలవర్తి వీరబాబు ముదినేపల్లి మండలం చిగురుకోట సమీపంలోని పొలాల నుంచి రూ.30 వేలకు కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తన ఇంటి వద్దకు తీసుకొచ్చే క్రమంలో ఇంటి సమీపంలోని విద్యుత్ వైర్లు వరిగడ్డి పై భాగానికి తగిలి మంటలు చెలరేగాయి. వెంటనే గడ్డిని అన్‌లోడ్ చేశారు. సమాచారం అందుకున్న కైకలూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్వాక్రా సభ్యుల అవసరాల మేరకు రుణాలు

వెలుగు ఎపిఎం జేమ్స్

చిట్‌చాట్

ప్రజాశక్తి - పోలవరం

వెలుగు ద్వారా స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్, బ్యాంకు లింకేజీ, సభ్యుల అవసరాలను గుర్తించి రుణాలు మంజూరు చేస్తున్నారని వెలుగు ఎపిఎం జేమ్స్ తెలిపారు. దీనిపైపై సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మండలంలో మహిళా సంఘాల కార్యకలాపాలు, రుణాల పురోగతి, జీవనోపాధి అవకాశాలపై పలు కీలక విషయాల గురించి ఆయన ప్రజాశక్తికి వివరించారు.

ప్రశ్న : మండలంలో మహిళా సంఘాలు (ఎస్‌హెచ్‌జిఎస్) పనితీరు ప్రస్తుతం ఎలా ఉంది?

ఎపిఎం : ప్రస్తుతం మండలంలో 1221 సంఘాలు, 12,250 మంది సభ్యులుగా ఉన్నారు. అయితే సంఘాలు ప్రతినెలా సమావేశాలు ఏర్పాటు చేసుకుని పుస్తక నిర్వహణ సక్రమంగా చేసుకుంటున్నాయి. వెలుగు ద్వారా స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్, బ్యాంకు లింకేజీ, సభ్యుల అవసరాలను గుర్తించి రుణాలు మంజూరు చేస్తున్నారు. సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్న : మహిళలకు జీవనోపాధి అవకాశాలు పెరిగేలా ఏ కార్యక్రమాలు అమల్లో ఉన్నాయి?

ఎపిఎం : ప్రస్తుత ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వివిధ రకాల రుణాలు మంజూరు(స్త్రీ నిధి ఉన్నతి, బ్యాంకు లింకేజీ) ఏర్పాటు చేసుకుని ప్రతి కుటుంబానికి అదనంగా పదివేల రూపాయలు ఆదాయాన్ని కల్పించి, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపడతాం.

ప్రశ్న : స్త్రీనిధి రుణాలు ఇవ్వడంలో ఎలాంటి సమస్యలు వస్తున్నాయి?

ఎపిఎం : స్త్రీ నిధి రుణాలు ఇవ్వడంలో ప్రస్తుతం ఎటువంటి సమస్యలు లేవు. గతంలో సంఘానికి గరిష్ఠంగా రూ.ఐదు లక్షలు ఉంటే ఇప్పుడు రూ.ఎనిమిది లక్షలు పరిమితిగా పెంచారు. అంతేకాకుండా సంఘాల సభ్యు లు మైక్రోఫైనాన్స్ సంస్థల వద్దకు వెళ్లకుండా స్త్రీ నిధి వినియోగించుకునేలా సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : స్థానిక మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసే విషయంలో వెలుగు ఏ సహాయం అందిస్తుంది?

ఎపిఎం : స్థానికంగా సంఘ మహిళలు తయారుచేసిన డ్వాక్రా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే విధానంలో జిల్లా కలెక్టరేట్‌లో, ఐటిడిఎ ఎదుట స్టాల్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తాం. అదేవిధంగా కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీ, ఐటిడిఎ పిఒ వారి సహకారంతో రాష్ట్రంలో డ్వాక్రా బజార్లను ఏర్పాటు చేసిన సభ్యులకు టిఎడిఎలు, సౌకర్యాలు కల్పిస్తాం.

హాస్టల్‌ను బుట్టాయగూడెంలోనే ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెంలోనే అద్దె భవనంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుట్టాయగూడెం ప్రాంత విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్‌ను సోమవారం కలిసి సమస్య వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ బుట్టాయగూడెంలో ఉన్న ఎస్‌సి బాయ్స్ హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో అధికారులు చేతులు దులుపుకోవడానికి బుట్టాయగూడెం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొత్తప్పగూడెంలో ఉన్న పాత ఐటిఐ ఏకలవ్య ప్రైమరీ పాఠశాలలో హాస్టల్ నిర్వహించేందుకు చూస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, హాస్టల్‌ను బుట్టాయగూడెం లోనే అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, మణికంఠ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేసే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మండలంలోని కొండగూడెం గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మండల టౌన్ కన్వీనర్ బొల్లు వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండలాధ్యక్షులు సిరిశెట్టి సిద్ధిరాజు, మానుకొండ దేవరాజు, చీకట్ల రమేష్, ఆడమిల్లి అచ్చయ్య, కరిపోతు దావీదు, ఆడమిల్లి వెంకన్న, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ముదినేపల్లి : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డివైఇఒ ఎస్.రవీంద్రభారతి అన్నారు. సోమవారం ఆమె ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఎంఇఒ నరేష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ కుమార్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్‌పై నిషేధాన్ని కొనసాగించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యకాస ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని కొనసాగించాలని, పేద, దళిత, గిరిజన భూములకు రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏపూరి రవీంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ విషయంలో జోక్యం చేసుకుని పేదలకు, దళితులకు న్యాయం చేయాలని, 9/77 చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, ఎస్ఆర్.శంకరన్ చేసిన చట్టాన్ని సవరించకుండా యధావిధిగా అమలు చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, తాడి అర్జునరావు, జంగం సుబ్బారావు, జి.రాజు, ఎస్‌కె.జహంగీర్ భాషా, మోహన్‌రావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పట్టాభి సీతారామయ్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

బ్యాంకింగ్, బీమా రంగాల్లో కొన్ని సంస్థలకు వ్యవస్థాపకులుగా వ్యవహరించిన భోగరాజు పట్టాభి సీతారామయ్య సేవలు అభినందనీయమని, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకు ఉన్న ముందుచూపునకు నిదర్శనమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని గుండుగొలను గ్రామానికి చెందిన భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులుగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సైతం ఆయన సేవల కొనసాగింపు ద్వారా ఆంధ్రా బ్యాంకు విస్తరించి పలువురికి ఉపాధి కల్పించిందని వక్తలు అన్నారు. ఆయన సొంత గ్రామమైన గుండుగొలనులో ఆయన సంస్మరణార్థం, ఆయన సేవలు ప్రజలకు తెలియజేసేందుకు గుండుగొలను కేంద్రంగా దశాబ్దాల కాలం క్రితం పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం ఏర్పడింది. వారి ఆధ్వర్యంలో గుండుగొలను చెరువుగట్టు వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజు సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ బ్యాంక్ గుండుగొలను శాఖ మేనేజర్ శ్రీనివాసరావు, పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం, కార్యదర్శి బిఎన్‌వి.కోటేశ్వరరావు మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ముదినేపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వి.నరసింహారావు అన్నారు. మండలంలోని వడాలిలో సోమవారం అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధిపొందిన రైతులను వీరమల్లు నరసింహారావు కలిసి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, రాయితీలను, యంత్రపరికరాల గురించి వివరించారు.

CHANGE OF NAME

I, KUDIPUDI BALA KRISHNA, S/o KUDIPUDI MOHANA RAO and KUDIPUDI NAGAMANI (new name), residing at D.No 8-48, BHUPAIAH CHERUVU, JINNURU, PODURU Mandal, W.G Dt., A.P changed my name KUDUPUDI BALAKRISHNA, S/o KUDUPUDI MOHANA RAO and KUDUPUDI NAGAMANI (old name) to KUDIPUDI BALA KRISHNA, S/o KUDIPUDI MOHANA RAO and KUDIPUDI NAGAMANI (new name). Henceforth, all my documents, Passport etc. will be continued with my new name shall henceforth be known as KUDIPUDI BALAKRISHNA.

CHANGE OF NAME

I, KADALI RAMA PRASAD (new name) residing at D.No.3-131/2, Kothapeta, H/o. Digamarru village, Palakol Mandal, W.G.Dist., A.P. Changed my name KOLLETI RAMA PRASAD CHETTI (old name) to KADALI RAMA PRASAD (new name) and my father name K. RAMACHETTI (old name) to KADALI RAM SETTI (new name) hence forth all my documents Passport etc will be continued with my new name shall henceforth be known as my name KADALI RAMA PRASAD and my father name KADALI RAM SETTI.

'రైతన్న మీకోసం'పై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించినట్లు చింతలపూడి వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పోలవరం : కొత్త పట్టిసీమ గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం మంగళవారం అధికారులు, సిబ్బంది విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి బుజ్జిబాబు, సొసైటీ అధ్యక్షుడు పూడి వెంకట్రావు, వ్యవసాయ శాఖాధికారి వి.కృష్ణ కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించారు. రైతులకు అవసరమైన పథకాల వివరాలు, సాగు సలహాలు, నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లిలోని రైతు సేవ కేంద్రంతో పాటు ప్రాంతీయ పశు వైద్య శిబిరంలో రైతన్న మీ కోసం కార్యక్రమంపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించినట్లు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయిబుచ్చారావు, మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు.

ఆగిరిపల్లి : రైతన్న మీ కోసంలో భాగంగా నిర్వహించే సర్వేను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జె.భవాని అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పిఎం కిసాన్, సాగు నీటి యాజమాన్యం, 90 శాతం రాయితీపై బిందుసేద్యం, పొలం పిలుస్తోంది, మేలైన విత్తనాలు, ఉద్యాన రైతులకు ఉజ్వల భవిత, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు.

చింతలపూడిలో...

మండవల్లి : వ్యవసాయంలో రైతులు కొన్ని మెలకువలను, సూత్రాలను పాటిస్తే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఎఒ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని అయ్యవారి రుద్రవరం లింగాల గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి రైతన్న నీకోసం కార్యక్రమంలో భాగంగా పంచసూత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని మెర్సపూడి గ్రామంలో సోమవారం రైతన్న -మీకోసం కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ సిఎం దిశానిర్దేశాల ప్రకారం రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధికి శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా ఈ వారోత్సవాలు ఇంటింటి ప్రచారం కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు రూ.70 వేలు విరాళం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పాఠశాలలో ఉన్న రికార్డును డిజిటలైజేషన్ చేయడం కోసం రూ.70 వేలు విరాళంగా అందించడం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆగిరిపల్లి జెడ్‌పి హెచ్ పాఠశాల హెచ్‌ఎం పి.పుష్పలత అన్నారు. పాఠశాలలోని పలు సర్టిఫికెట్స్ పూర్వ విద్యార్థులకు త్వరతగతిన అందించడం కోసం డిజిటలైజేషన్ అవసరమని భావించి గ్రామ ప్రముఖులు, టిడిపి నూజివీడు సమన్వయకర్త మడుపల్లి గోపాలకృష్ణను కోరగా స్పందించిన ఆయన కీర్తిశేషులు మడుపల్లి నారాయణరావు, మడుపల్లి నరసింహామూర్తిల జ్ఞాపకార్థం వారి కుమారులు మడుపల్లి గోపాలకృష్ణ, చంద్రమోహన్, అశోక్‌కుమార్, గోపాలకృష్ణ, ప్రసాద్, వెంకట దిలీప్‌కుమార్, ఉమామహేశ్వరరావులు రూ.70వేలు విరాళంగా అందించగా సోమవారం స్కూల్‌లో సదరు కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.


విరాళం అందిస్తున్న మడుపల్లి కుటుంబ సభ్యులు

నేటి నుంచి సింగరాయపాలెం షష్టి ఉత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి



జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీ మంగళవారం నుంచి వార్షిక షష్టి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు డిసెంబర్ ఏడో తేదీ వరకు 13 రోజుల పాటు జరుగుతాయి. ఉత్సవాల నిర్వహణకు దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాల్లోను, ప్రధాన కూడలిలో విద్యుద్ధీపాలంకరణతో భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. డిసెంబరు ఏడో తేదీన అఖండ అన్నసమారాధన ఉంటుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. సుమారు 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో షష్టి ఉత్సవాల్లో భక్తులు సంతృప్తి చెందేలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు గంగా శ్రీదేవి అన్నారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గుడివాడ, మచిలీపట్నం, భీమవరం డిపోలకు చెందిన ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు తిరగనున్నాయి. యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

షష్టి ఉత్సవ కమిటీ సభ్యులు వీరే

సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవ కమిటీ సభ్యులను దేవాదాయ శాఖాధికారులు సోమవారం ప్రకటించారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా 11 మందిని నియమించారు. వీరిలో బొంగు రవికుమార్, యు.విమల, వి.నాగలలిత, నీలం శివ రమేష్, పరసా కృష్ణ, బి.సోవమ్మ, కె.సుబ్బలక్ష్మి, డి.నాగలక్ష్మి, బిఎన్‌వి.రాధాకృష్ణ, బి.నాగశిరీష, ఎస్.నాగకొండ షష్టి ఉత్సవ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

టెన్త్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ పోయినది

నేను 10-11-2025 సంవత్సరంలో మా ఇంటి వద్ద నుండి పోలవరం లో ఉన్న జిరాక్స్ షాప్ కి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో నా యొక్క టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ (ఒరిజినల్) జిరాక్స్ తీసుకుని నా బండి సైడ్ కవర్లో పెట్టుకొని ఇంటి వద్ద కు వచ్చుచుండగా టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ నెంబర్: SS156913 నెంబర్ గల మార్క్ లిస్ట్ మార్గమధ్యలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల దయచేసి ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కురుమళ్ళ అర్చన, కేరాఫ్ నాగరాజు
ఇంటి నెం.4-124, కమ్మరగూడెం,
పోలవరం మండలం, పిన్కోడ్ 534 315,
ఏలూరు జిల్లా, ఎ.పి., సెల్: 6309255279

మహారాజశ్రీ భీమవరం 1st Addl, సివిల్ జడ్జి (Jr D) వారి కోర్టులో
O.S.No.51/2025

వాది: పాలా వెంకట సుబ్బారావు
ప్రతివాద్లు : పాలా పెద్దిరాజు వగైరా
1వ ప్రతివాది : పాలా పెద్దిరాజు, S/o.వెంకటేశ్వరరావు, R/o.D.No.4-28, గొరగనమూడిపాలెం, గొరగనమూడి, పాలకోడేరు మండలం.

పై నెంబరు దావాలో వాది, 1వ ప్రతివాది అయ్యిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను పోస్టు ద్వారాను 2,3 పర్యాయములు జారీ చేయించినప్పటికి 1వ ప్రతివాది అయ్యిన మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. పైనెంబరు దావాలో 1వ ప్రతివాది అయ్యిన మీ హాజరు నిమిత్తం పైదావాను ది.16.12.2025 సం॥రం తేదీన వాయిదా వేసినారు. 1వ ప్రతివాది అయ్యిన మీరు సదరు వాయిదా తేదీ ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియ చేసుకోవలెను. లేనియడల పైనెంబరు దావాలోను సదరు వాయిదా తేదీని 1వ ప్రతివాది అయ్యిన మీ పరోక్షమందు తీర్మానించడమగును.

ఎం.వి.వి.శివసత్యనారాయణ
వాది తరుపున అడ్వకేటు, భీమవరం.
సెల్: 9949345699

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, అమ్మపాలెం గ్రామమునకు చెందిన వీరంకి మురళీ గారి భార్య వీరంకి భాగ్యలక్ష్మి తెలియచేయునది ఏమనగా ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వట్లూరు గ్రామములో జిరాయితీ పల్లం ఆర్.యస్.నెం.24/8 య.0.61 సెంట్లు మరియు ఆర్.యస్.నెం.24/9 య.0.61 సెంట్లు వెరశి య.1.22 సెంట్లు భూమిని మా ముత్తాత గారు అయిన పరసా శ్రీరాములుగారు డాక్యుమెంట్ నెం.3686/1948 మరియు డాక్యుమెంటు నెం.1315/1952 లు వేలేటి కృష్ణందాసు గారు కుమారుడు స్వామియేలు వగైరాలు వలన మరియు చవాకుల సిక్కమ్మ వగైరాల ద్వారా కొనుగోలు చేసియున్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజులను E.C తీసుకొను నిమిత్తము ది.10-11-2025వ తేదీన వట్లూరు రిజిస్టరు ఆఫీసుకు తీసుకుపోవునప్పుడు మార్గ మధ్యములో వట్లూరు గ్రామములో సదరు దస్తావేజుల గల సంచి పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు. సదరు దస్తావేజులు ఎవరైన దుర్వినియోగం చేసిన యెడల వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

వీరంకి భాగ్యలక్ష్మి, భర్త వీరంకి మురళి
ఏలూరు అమ్మపాలెం, పెదవేగి మండలం,
తేది.22-11-2025 ఏలూరు జిల్లా.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.894/2025 in O.S.No.421/2025

Between:
G.V.V.Satyanarayana Gupta ...వాది/పిటిషనర్
మరియు
Bajaj Finance Ltd and 4 Others ...ప్రతివాదులు/రెస్పాండెంట్లు

5వ ప్రతివాదికి/రెస్పాండెంట్‌కి నోటీసులు

అడ్రస్సు: RBL Bank of Tanuku Branch, D.No.26/6/15, 1st Floor Sri Matha Towers, Opp.Kummarla Street, Rajiv Chowk, Velpur Road, Tanuku, W.G.Dist-534211.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ననుసరించి పైనెంబరు గ్రంథములో I.A.No.894/2025 in O.S.No.421/2025లో మీలో 5వ ప్రతివాది/రెస్పాండెంట్ అయిన RBL Bank of Tanuku Branch వారు మరియు ఇతర నాలుగు బ్యాంకులు వాది అయిన G.V.V.Satyanarayana Gupta తన ఇంటికి ప్రతివాది సంస్థ ప్రతినిధులు మరియు ఏజంట్లు రాకుండా Temporary మరియు Perminant Injuction కోసం దావా దఖలు చేసిన విషయంలో ప్రతివాది నెం.5 అయిన వారికి సాధారణ మరియు అర్జెంట్ సమన్లు అందకపోవడంతో ఈ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఇవ్వడమైనది.
ప్రతివాది నెం.5 ది.15-12-2025 ఉదయం 10.30 గంటలకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తణుకు వారి ఎదుట స్వయంగా గాని, తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదనలు తెలియజేయవలెను. హాజరు కాని పక్షంలో మీ పరోక్షంలో విచారించబడును.

B.N.V.Ganesh
Tanuku O.S.Nageswararao
Dt.24-11-2025 Advocates, Tanuku.

ప్రకటన
మహారాజశ్రీ మచిలీపట్నం పదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
F.D.I.A.226/2024 in O.S.28/2021

పిటీషనరు/వాది :
సుందర ఈశ్వర వెంకట దుర్గారావు
Vs
రెస్పాండెంటు/ప్రతివాద్లు :
1.మంగాడ్డి సురేంద్ర
2.మంగాడ్డి రేవతి
To.
1.మంగాడ్డి సురేంద్ర, S/o.మాధవరావు
2.మంగాడ్డి రేవతి, W/o.సురేంద్ర
భీమవరం, కో-ఆపరేటివ్ ఎస్టేట్స్ మరొక్క అడ్రస్సు డోరునెం.19-22-5/1A కాపు కళ్యాణ మండపం వీధి, 26వ వార్డు, బ్యాంకు కాలనీ, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

రెస్పాండెంట్లకు పై నెంబరు FD పిటిషన్‌లో కోర్టు వారు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్ని మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు FD పిటీషనులో నోటీసులు అమలు జరుపు నిమిత్తం యీ పేపరు ప్రకటన ద్వారా అమలు జర్పడమైనది. కాబట్టి ది.17-12-2025 సం॥రం ఉ.10.30లకు పై కోర్టులో మీరు స్వయముగా గాని అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

By Order of Court
గునిశెట్టి శ్రీనివాసరావు
బోగిరెడ్డి వెంకన్నబాబు
అడ్వకేట్లు, మచిలీపట్నం
మచిలీపట్నం సెల్: 9553126234
తేది.23-11-2025 9909009916

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.502/2023

బిట్వీన్ :
1.బేతాళ వేణుగోపాలకృష్ణ రాజు వగైరాలు ...వాద్లు
మరియు
1.వేగేశ్న వేణుగోపాలకృష్ణరాజు వగైరాలు ...ప్రతివాద్లు
టు
వేగేశ్న రామరాజు, తండ్రి వేణుగోపాలకృష్ణ రాజు, డోర్‌నెం.6-1, తేతలి గ్రామం, తణుకు మండలం, ప.గో.జిల్లా. ...2వ ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథంలో 2వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు శ్రీకోర్టు ద్వారా మరియు రిజిస్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించిననూ, అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పైకోర్టు వారి ఎదుట ఈ పబ్లికేషన్ తేది నుండి 30 రోజులలోగా పైకోర్టు వారి ఎదుట పై నెంబరు దావాలోను అనగా ఓ.ఎస్.502/2023 మరియు సదరు దావాలోని ఐ.ఎ.నెం.1120/2023 మరియు 1121/2023 పిటిషన్‌లో పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు అనగా ఈ పబ్లికేషన్ నుండి 30 రోజులలోగా మీరు స్వయంగా కానీ మీ తరపు ప్లీడరు గారి ద్వారా గానీ శ్రీకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. ఈ దావా వాయిదా 22-12-2025

ఇవటూరి కిషోర్
తణుకు వాది తరపు అడ్వకేట్
తేది.25-11-2025 సెల్: 98485 44550